# రాగి వెన్నెల

సర్వ శోకాలూ బూడిదకుప్పలై

ఎగిరిపోతున్నాయి

క్రితం రాత్రి కండల్ల దూరిన జింగన్న పురుగు

బంతి పువ్వులాగ కంట్లోనే పుష్పవతయ్యింది

కరాచీలో సచ్చిపోయిన నూర్జహాన్ గొంతు

గలా పేటికలోకి సరసరా పాకుతూ వచ్చి

అలసిపోయి పడుకుంది

ఇరానీ మెకమ్‌బఫ్ గుండెని విప్పదీసి

డోలీతో రాగి రంగును

వంపుతున్నాడు

కుంభమేలాలో కావాలనే ఆపాల తాతమ్మ

తప్పిపోయింది

ఇప్పుడిక నిద్రపోవడం ఎంత వాస్తవమో

దుఃఖించడమూ

సుఖనెత్తురుని స్ఖలించడమూ అంతే వాస్తవం

ఏదనుకుంటే అదీ...

ఏది కాదో అదీ...

రుతువులపై

రంగులపై

జాలీ జాలీ మ్యాట్నీ బట్టలపై

తియ్యటి ప్రేమల గ్నాపకాల పొరలపై

బడ్జెట్ వొకటి కాండ్రించి తుపుక్కున ఉమ్మితుంది

నియ్యతుందా... రా... నీకు
నీయమ్మ మనిషివేనా అంటూ
దరాయించి వెయ్యి రూపాల నోటుపై
ఉష్... ష్ పోసుకుంటాను
నా మోకుకు నేనే కొయ్యనవుతాను
కంటి పాపను కమ్మకత్తితో చింతగించుకుంటాను ఏదనుకుంటే అదే...
వుంది
నాకిప్పుడు ఒక్కడే మొగోడు
ఏదనుకుంటే అదే చేసేటోడు
దమ్ముందా...
రొమ్ముందా...
ఒక్కసారి తాలిబన్‌లా బద్దలుగొట్టగలవా
దేన్నయినా సరే...
ఎవర్నీ ఎవతినీ ఎక్కడ ఎప్పుడైనా సరే
మనమిముదు లో ఓల్టేజ్ బల్బుల కోసం
పహారా కాస్తున్నాం
కరెంటును పొదుపు చేయాలి
ఆకలిని పొదుపు చేయాలి
కన్నీళ్ళనీ కవిత్వాలనీ పొదుపు చేయాలి
నిజాల్ని పొదుపు చేయాలి
చీమూ నెత్తురుని చీదర చింతలనీ
పొదుపు చేయాలి
ఆం... చ్... గీం... చ్ అల్లర బగాం... చ్...
అంటూ తీరికగా ఏదీ తెలియనట్టు

ఆడుకోవాలి

ఎంతో కొంత వెనకేసుకోవాలి

అమ్మను బొమ్మను చేసయినా సరే

అంతట్నీ అమ్ముకోవాలి

అదే సుఖం... అదే వరం... అదే జ్వరం...

క్రితం రాత్రి కండ్లల్ల దూరిన జింగన్న పురుగు

కండ్లల్లనే కడుపును పోగొట్టుకుంది

శాంతి

అశాంతి

విశాంతి

రాగి వెన్నెల శాంతి

సిద్ధార్థ

(‘బొమ్మలబాయి’ – 02.03.2001)